క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఓటరు కార్డు సవరణకు అవకాశం

కడప అర్బన్ : భారత ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ- 2025 ఈనెల 20న ప్రారంభమైంది. 1.1.2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, నిండబోవు వారు తమ ఓటరు లిస్టులో తమ ఓటును నమోదు చేసుకోవచ్చు. ఓటు కార్డు సవరణలు ఏవైనా వున్నపక్షంలో వాటిని సవరించుకునే అవకాశం కలదు. మీకు అందుబాటులోని బూత్ లెవెన్ ఆఫీసర్‌ను లేదా తహసీల్దార్‌ను సంప్రదించారు.

మహిళ ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో తన భర్త మస్తాన్ ఖాన్, పిల్లలతో నివాసం వున్న హసీనా (48) అనే మహిళ ఇంటిలో ఎవరూలేని సమయంలో మంగళవారం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలతో ఈ ఘటనకు పాల్పడి వుంటుందని ప్రాథమిక విచారణ ద్వారా తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

తాలుకా సీఐకి శుభాకాంక్షలు



సీఐ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ జి.వెంకటేశ్వర్లు ఈ నెల 19న బాధ్యతలను చేపట్టారు. ఆయనను మంగళవారం కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ స్టేషన్ పరిధిలోని అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తాహీర్ హుసేన్ పాల్గొన్నారు.

అభినందనలు

కడప కార్పొరేషన్ : తాలూకా పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి అభినందనలు తెలిపారు. సీఐకు ఆయన శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చంద్రారెడ్డి, కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు బంద్



సమావేశంలో మాట్లాడుతున్న జాకట విజయ్‌శేఖర్

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన నిర్వహించే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రాష్ట్ర మాల మహానాడు (జాకట విజయ్ శేఖర్ వర్గం) రాష్ట్ర అధ్యక్షులు జాకట విజయ్‌శేఖర్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బహుజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 21వ తేదీన నిర్వహించే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ ఈ బంద్‌న జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్, రాయలసీమ అధ్యక్షులు భాస్కర్, జిల్లా అధ్యక్షుల సంజీవయ్య, చెంచుల డేవిడ్, సత్యరాజ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన నిరసన



కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల నిరసన ర్యాలీ

కోల్‌కతా ఘటనపై కొనసాగుతున్న ఆందోళనలు

కడప అర్బన్ : పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో ఆర్‌జీవికార్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థినిపై అత్యాచారం, హత్య సంఘటనపై నిరసన వెల్లువెత్తింది. నిందితులను వెంటనే శిక్షించాలని కోరుతూ కొన్ని రోజులుగా చేపడుతున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. కడప రిమ్స్‌లో జూనియర్ డాక్టర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను మంగళవారం పరిపాలన విభాగం అధికారి సునీత ప్రారంభించారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినుల ర్యాలీ

వైవీయూ : కడప నగరంలో ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా మాట్లాడుతూ మెడికో విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వీరభద్రయ్య, గురుమోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, పి.శచీదేవి, స్వరూపదేవి పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి

కడప కల్చరల్ : ఆగస్టు 8న మహిళా డాక్టర్ మానభంగం, హత్య దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని ఎల్ఐసీ కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, మహిళా కన్వీనర్ అమీనా పర్వీన్ అన్నారు. ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు, నాయకులు కొవ్వొత్తులు వెలిగించి మృతురాలికి నివాళులర్పించారు. యూనియన్ డివిజన్ అధ్యక్షుడు అవధాన శ్రీనివాస్, నాయకులు అక్బర్ బాషా, సుధీకర్, వారిజాతమ్మ, వసుప్రద శ్రీవాణి, పద్మజాలత, శ్రీకృష్ణ, కేసీఎస్ రాజు, కుమార్, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు చట్టాలు తయారు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైద్యుల రక్షణకు చట్టాలు రూపొందించాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా కోరారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జేకే యూత్ ఆధ్వర్యంలో నగరంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు చాంద్‌బాషా, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ సేవకులు

కడప నగర ప్రజలకు సమృద్ధిగా నీటిసరఫరా



గండి వాటర్ వర్క్స్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్ : కడప నగర ప్రజలకు సమృద్ధిగా నీటిసరఫరా చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. మంగళవారం ఆయన గండి వాటర్ వర్క్స్, జగనన్న కాలనీ, పక్కీరుపల్లె చెరువు, సీఎస్ఐ చర్చి, నిరంజన్ నగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గండి వాటర్ వర్క్స్ వద్ద స్టాక్, అటెండెన్స్ రిజిస్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇన్ ఫిల్టరేషన్ వెల్ వద్ద పైప్‌లైన్, పంప్‌హౌస్‌లోని 75 హెచ్‌పీ మోటార్లను పరిశీలించారు. లింగంపల్లి పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేయవలసినటువంటి వసతులు, మిషనరీ సంబంధిత ఫైల్స్ వెంటనే పంపించాలని సూచించారు. వాటర్ ట్యాంక్ పైపుల నుంచి నీరు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద సీసీ కెమెరాలు వాడుకలోకి తీసుకురావాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు త్వరితగతిన చేయించాలన్నారు. కేబుల్స్ బయటికి రాకుండా పీవీసీ పైపులో ఏర్పాటు చేయాలని, ట్యాంకుపై ఉన్న క్లోరినేషన్ పైపులకు క్యాప్స్ తొడగాలన్నారు. జగనన్న కాలనీలో లైట్లు, వాటర్ పైప్‌లైన్ కనెక్షన్స్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫక్కీరుపల్లె చెరువుకు సమీపంలో బోర్డు ఏర్పాటు చేయాలని, ఫక్కీరుపల్లె రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. నిరంజన్ నగర్ ప్రజల అర్జీ మేరకు కమిషనర్ వచ్చి సమస్యను పరిశీలించారు. మురికి నీరు వెళ్లేందుకు కాలువల నిర్మాణం చేయాలన్నారు. రోడ్ల నిర్మాణానికి తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ ధనలక్ష్మి, డీఈలు కరిముల్లా ఖాన్, ఏఈ అంజలి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటోగ్రఫీ రంగంలో సేవలందిస్తున్న వారిని సన్మానిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న రాయల్ ఫొటో స్టూడియోలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి, డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ గంగుల ఎల్లేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రెసిడెంట్ పి.జయభారత్‌రెడ్డి, యునైటెడ్ ముస్లిం ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీక్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రఫీలో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని సన్మానించడం ఎంతో అభినందనీయం అన్నారు. రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్‌ల సంఘాన్ని బలోపేతం చేస్తూ నూతన టెక్నాలజీతో అవగాహన పరిచి ఫొటో, వీడియో గ్రఫీ రంగానికి సేవలందించడం ప్రశంసనీయమన్నారు. అదే విధంగా గంగుల ఏల్లేశ్వరరావు 1920 నుంచి ఇప్పటి వరకు కెమెరాలను దాచిపెట్టి ఫొటో ఎగ్జిబిషన్ కూడా నిర్వహించడం ఆయన అందిస్తున్న సేవలు జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయాలు నెరవేర్చాలి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణుప్రీతంరెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్‌గాంధీ టెక్నాలజీ, కమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఆయన యువతను ప్రోత్సహించడం, దేశాభివృద్ధికి ముందడుగు వేయడం వంటి ఎన్నో మంచి పనులు చేశారన్నారు. భారతదేశానికి ఎన్నో సేవలు అందించి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పఠాన్ మొహమ్మద్ ఆలీఖాన్, మామిళ్ల నరసింహులు, మామిళ్లబాబు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



అన్నదానం నిర్వహిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ కేక్ తెచ్చి ఆయనతో కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మతపెద్దలు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సంప్రదాయపద్ధతిలో ప్రార్థనలు చేసి ఆయన్ను ఆశీర్వదించారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మనిషి, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే రవీంద్రనాథ్‌రెడ్డి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, పి.జయచంద్రారెడ్డి, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, కరిముల్లా, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పాకా సురేష్‌కుమార్, రామలక్ష్మణ్‌రెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, సీహెచ్ వినోద్ కుమార్, షఫీ, కె.బాబు, సుబ్బరాయుడు, పస్తం అంజి, సీహెచ్ సునీల్, ఏ1 నాగరాజు, రహీం, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, బి.మరియలు, హైమవతి, సుశీలమ్మ, తులశమ్మ, మల్లీశ్వరి, పద్మ తదితరులు రవీంద్రనాథ్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి కేకులు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు ముందు పులి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'రెడ్యం' శుభాకాంక్షలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కమలాపురం మాజీ శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం కడపలోని రవీంద్రనాథరెడ్డి స్వగృహానికి వెళ్లిపుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం



మారథాన్ 5కే రన్‌ను ప్రారంభిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : ఎయిడ్స్ పట్ల అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్య శాఖ వారు నిర్వహించిన 5కే మారథాన్ రన్ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి వుండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాకింగ్ రన్ యోగ మొదలైన వ్యాయామాల ఉపయోగాలు తెలియజేశారు. అనంతరం జెండా ఊపి 5కే మారథాన్ రన్ నిర్వహించారు. ఈ మారథాన్ మహావీర్ సర్కిల్ నుంచి రైల్వే బ్రిడ్జి రిమ్స్ రోడ్డు వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, ఉప వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్జీవోలు, పారా లీగల్ వలంటీర్‌లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పని సర్దుబాటులో అన్యాయం చేయొద్దు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న పని సర్దుబాటు ప్రక్రియలో ఎస్‌జీటీలకు అన్యాయం చేయొద్దని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ కోరారు. స్థానికంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్‌జీటీ మిగులు ఉన్న పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టుల బదలాయింపు జరిగే సందర్భంలో అర్హతలు ఉన్న ఎస్‌జీటీలను అక్కడనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్త స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరయ్యే పాఠశాలల్లో అవసరమున్న అర్హతలుంటే ఉపాధ్యాయులను సర్ ప్లస్ నుంచి మినహాయింపుతో ఖాళీ సబ్జెక్టుకు బదలాయింపు చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లకు బీఈడీలో అదనపు మెథడాలజీ ఆధారంగా సబ్జెక్టు కన్వర్షన్ వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో చేసిన విధానాన్ని ఎస్‌జీటీలకు కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య యూపీ పాఠశాలల్లో ఉందని తెలిపారు. వీటి పరిష్కారానికి రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. మండల స్థాయి వరకు మాత్రమే వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ ముగించాలని, ఇష్టం ఉన్న ఉపాధ్యాయులకు మాత్రమే డివిజన్ స్థాయిలో అడ్జెస్ట్‌మెంట్ చేయుటకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వీటికి సంబంధించిన క్లారిఫికేషన్ ఉత్తర్వులు రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేయాలని అన్నారు. చర్చలకు రిజిస్టర్డ్ సంఘాలను కూడా పిలవాలని విన్నవించారు.

వైవీయూ ఇన్‌చార్జి వీసీని తొలగించాలి

- ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల
- 23న ముట్టడికి పిలుపు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డిపై ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఆయన్ను ఆ పదవి నుంచి తొలగించాలంటూ ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. ఆచార్య కె.కృష్ణారెడ్డిపై వచ్చిన అవినీతి, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన ఆరోపణలపై మంగళవారం విశ్వవిద్యాలయంలో కరపత్రాలు విడుదల చేయడంతో పాటు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగాసురేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా పని చేసిన సమయంలో ఆచార్య కె.కృష్ణారెడ్డిపై లైంగిక ఆరోపణలు వచ్చాయని, దీంతో ఆయన్ను పదవి నుంచి సైతం తొలగించారని గుర్తు చేశారు. అసభ్య ప్రవర్తన, ఆడియో టేపులు బయటకు వచ్చాయని, వీటితోపాటు కృష్ణా విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేసిన సమయంలో సైతం ఈయనపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇలాంటి వ్యక్తికి ఇన్‌చార్జి వీసీ పదవి ఇవ్వడం సరికాదన్నారు.

రాజ్యాంగ పదవులకు విద్యార్హత మాత్రమే సరిపోదని, వ్యక్తిత్వం కూడా ముఖ్యమన్నారు. ఈయన్ను వీసీ పదవి నుంచి తొలగించాలంటూ ఈనెల 23న వైవీయూ పరిపాలన భవనాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, నగర ఉపాధ్యక్షుడు తేజ, అకీరా నందన్, రాజేష్, మస్తాన్, షరీఫ్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీపై ఆరోపణలు అవాస్తవం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణా రెడ్డిపై పనిగట్టుకొని చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని యోగివేమన విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం తాత్కాలిక అధ్యక్షులు ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.సుభోష్ చంద్ర తెలిపారు. ఆచార్య కృష్ణారెడ్డి యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు మహిళతో అసభ్యంగా ప్రవర్తించారని ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, గిట్టని వారు ప్రయివేటు సంభాషణలను రికార్డు చేసి వైరల్ చేయించారన్నారు. ఏ మహిళతో అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారో, ఆమె స్వయంగా తనను ఎలాంటి ఇబ్బంది పెట్టలేదని రాతపూర్వకంగా ఇచ్చారని తెలిపారు. వీటిపై ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపారని, ఆచార్య కృష్ణారెడ్డి తప్పు చేయలేదని కమిటీ తేల్చిందన్నారు. అదే విషయాన్ని పాలకమండలి ఆమోదించిందని, దానికి సంబంధిత పత్రాన్ని అందజేశారు. ఆచార్య కె.కృష్ణారెడ్డి కృష్ణా విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేసినప్పుడు పాలనా వ్యవహారాల్లో నిక్కచ్చిగా వ్యవహరించినందుకు కొంతమంది ఆయన అవినీతికి పాల్పడుతున్నారన్నారని ఆకాశరామన్న ఉత్తరం రాశారు. అప్పటి ఒక మంత్రి ప్రోద్బలంతో ఏసీబీ అధికారులు విచారణ జరిపి ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని ధ్రువీకరించారన్నారు. కొంత మంది స్వలాభం కోసం వీగిపోయిన అసత్య ఆరోపణలను పదే పదే ప్రచారం చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడడం బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఒక విశ్వవిద్యాలయ అధ్యాపకుడిపై కక్ష గట్టుకొని తప్పుడు రాతలు రాయించడం మంచిది కాదని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదన్నారు.

13 ఏళ్లుగా పెరగని కాంట్రాక్టు కార్మికుల వేతనాలు



కార్మిక మంత్రి శుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీపీపీ యూనియన్ నాయకుడు సుబ్బారెడ్డి

ఎర్రగుంట్ల : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2012లో కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంపుదల చేస్తూ జీవో 11ను విడుదల చేశారు. ప్రతి ఐదేళ్లకు కనీసం వేతనాలను పెంపుదల చేయాల్సి ఉండగా 13 ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచకపోవడం అన్యాయమని ఆర్టీపీపీకి చెందిన ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కార్మిక మంత్రి వాసంశెట్టి శుభాష్‌ను వారు కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సిమెంట్ పరిశ్రమలు, విద్యుత్ సంస్థలు వివిధ భారీ పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. జీఓ 11ను సవరించకపోవడంతో కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. కనీస వేతనాలను పెంచడం వల్ల ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక బారం ఉండదని ఎందుకంటే అధిక శాతం కార్మికులు ప్రవేటు పరిశ్రమల్లో పనిచేస్తూ జీఓ 11 కింద కనీస వేతనాలు పొందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదేళ్లకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ల ఒక్కసారి వేతన సవరణ జరుగుతుందని కార్మికులకు మాత్రం 13 ఏళ్ల అయిన వేతనాలు పెరగలేదన్నారు. దీనిపై స్పందించిన కార్మిక మంత్రి శుభాష్ ఈ విషయంపై వివిధ పరిశ్రమ యజమానులతో చర్చించి సీఎం చంద్రబాబుతో సమావేశం నిర్వహించి కార్మికుల కనీస వేతనాలపై త్వరలోనే సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రావు, గంగయ్య, షంషేర్‌వల్లి, రాజులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సభను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : విశాఖపట్నంలో సెప్టెంబర్ 3న నిర్వహించే ఏఐటీయూసీ భారీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, మాజీ జిల్లా కార్యదర్శి బి.రామయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధి పెన్నానగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు.

కెరీర్ కౌన్సెలింగ్‌తో అవకాశాలు పుష్కలం



మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్

వైవీయూ : కెరీర్ కౌన్సెలింగ్ పొందడం ద్వారా విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని స్టెప్ సీఈఓ సి.సాయి గ్రేస్ సూచించారు. మంగళవారం కడప నగర శివారులోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో కెరీర్ కౌన్సెలింగ్ పైన, విష్ణు విద్యామందిర్‌లో వ్యక్తిత్వ వికాసంపైన అవగాహన సదస్సులు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు కోర్సులు ఎంపిక సమయంలో సరైన మార్గదర్శనం పొందితే చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. అనంతరం కెరీర్ కౌన్సిలర్ గుణశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ ఫరూఖ్, విష్ణు విద్యామందిర్ కరస్పాండెంట్ శ్రీనివాసులరెడ్డి, ఫణిభూషణ్‌రెడ్డి, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బారాయుడు, అబ్బాస్ అలీ, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.